క్లుప్తంగా

అంగన్‌వాడీల వేతనాలు పెంచండి..



చినబొడ్డేపల్లిలో సర్పంచ్ శివరామ్‌కు వినతి పత్రం అందిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కోటవురట్ల: అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని సిబ్బంది డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని అంగన్‌వాడీ సిబ్బంది నిరసన తెలిపి సర్పంచులకు వినతిపత్రాలు అందజేశారు. చినబొడ్డేపల్లిలో అంగన్‌వాడీ సిబ్బంది సర్పంచ్ పైల శివరామ్‌కు మెమొరాండం అందజేశారు. వేతనాలు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలకు పెంచాలని, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించాలని కోరుతూ రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు ఈ నెల 8 నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నట్టు సిబ్బంది తెలిపారు.

షెడ్యూల్ కులాల హక్కులు కాపాడాలి



ఫిర్యాదు కాపీని చూపుతున్న దృశ్యం

మునగపాక : షెడ్యూల్ కులాల రిజర్వేషన్‌ను దుర్వినియోగం కాకుండా అంగన్‌వాడీ ఆయా పోస్టుకు తనను ఎంపిక చేయాలని కోరుతూ గంగాదేవిపేటకు చెందిన దళిత మహిళ బచ్చల పైడిగున్న సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించిన ఫిర్యాదు కాపీని విలేకరులకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంగాదేవిపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేసేందుకు ఆయా పోస్టుకు నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. ఆయా పోస్టుకు సంబంధించి ఎస్సీ మాల కులస్తులు దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్‌లో ఉన్నప్పటికీ ఎటువంటి విచారణ చేయకుండా ఐసీడీఎస్ అధికారులు అర్హులెవరూ లేరంటూ మరో నోటిఫికేషన్ ఇవ్వడం సరికాదన్నారు. రిజర్వుడు ప్రకారం చెందాల్సిన హక్కులను అధికారులు హరించడం విచారకరమన్నారు. ఈ విషయమై తనకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

బీఎల్‌వోలు రిజిస్టర్‌లను సక్రమంగా నిర్వహించాలి

మునగపాక: రెండు రోజుల పాటు నిర్వహించిన ఓటరు నమోదు ప్రత్యేక డ్రైవ్‌కు సంబంధించిన రిజిస్టర్‌లు సక్రమంగా నిర్వహించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మనోరంజని తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి బీఎల్‌వోలతో ఆమె సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఎల్‌వోలు ఓటరు నమోదుకోసం వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ ప్రక్రియ వేగవంతమయ్యేలా చూడాలన్నారు. స్థానికంగా ఉండే బీఎల్‌ఏల సహకారం తీసుకొని ఓటరు నమోదుకు సంబందించి వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించాలన్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్‌కుమార్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పెదపాడులో వై ఏపీ నీడ్స్ జగన్

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని పెదపాడు గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు దేశంశెట్టి శంకర్‌రావు, కోన బుజ్జి పాల్గొన్నారు.

శభాష్ వలంటీర్



విశాఖ ఈఎన్టీ ఆస్పత్రిలో తాతలుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ముని

మునగపాక: నాగవరం గ్రామానికి చెందిన మేడిశెట్టి తాతలు విశాఖలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వలంటీర్ ముని సోమవారం అక్కడకు వెళ్లి రూ.2750 పింఛన్ అందజేశాడు. ఒంపోలుకు చెందిన సోమునాయుడు విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందడంతో సంబంధిత వలంటీర్ పుర్రె జానకి పింఛన్ అందజేశారు. తిమ్మరాజుపేటకు చెందిన రాంప్రసాద్ అనారోగ్యంతో బాధపడుతూ కంచరపాలెంలో తన బంధువుల ఇంటి వద్ద ఉండడంతో వలంటీర్ ముప్పిడి రాజు పింఛన్ అందజేసి మానవత్వం చాటుకున్నారు.

తలెత్తుకు నిలబడి

జగనన్న ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. మనబడి –నాడు నేడు పథకం కింద పాఠశాలల రూపు రేఖలు మార్చివేసింది. పాఠశాలలు, కళాశాలల భవనాలను ఆధునీకీకరించడం తో పాటు అవసరమైన చోట అదనపు భవనాలు నిర్మించి పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించింది. జగనన్న గోరు ముద్ద ద్వారా విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం, అమ్మ ఒడి పథకం కింద ఏటా రూ.15వేలు, జగనన్న విద్యా కానుక ద్వారా దుస్తులు, బూట్లు, బ్యాగ్ వంటి సదుపాయాలు అందిస్తోంది.

- చెట్లకింద చదువులకు స్వస్తి
- మారిన ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు
- ఆకర్షణీయంగా తరగతి గదులు
- బెంచీలు, ఇతర సదుపాయాలు
- ఆధునికమైన మరుగుదొడ్లు



నక్కపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒక పక్క వంట, మరో పక్క తరగతుల నిర్వహణ



ఇదే పాఠశాలలో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా వంటషెడ్లు

నాడు-నేడు నిధులు ఇలా..

మొదటి విడత మంజూరైన పాఠశాలలు	వెచ్చించిన నిధులు
38	రూ.16 కోట్లు

రెండో విడత..పాఠశాలలు	వెచ్చించిన నిధులు
35	: రూ.15.90 కోట్లు

నియోజకవర్గంలో...

పాఠశాలలు : 204

ఒక్కో పాఠశాలకు రూ.20 లక్షల నుంచి రూ.1.20 కోట్లు

మొత్తం నిధులు :	పూర్తయిన భవనాలు
రూ.92 కోట్లు	168



నక్కపల్లి: పాఠశాలల రూపు రేఖలు మారిపోయాయి. ఎన్నో ఆశలతో ఆశయాలతో ఉన్నత చదువులు చదివి మంచి ప్రయోజకులవుదామని వచ్చే చిన్నారులకు గత ప్రభుత్వ హయాంలో పాఠశాలల్లో ఎదురయ్యే సమస్యలు ఉన్నత విద్యకు అవరోధంగా మారేవి. ఉదాహరణకు నక్కపల్లిలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గతంలో ఉన్న పరిస్థితులను పరిశీలిస్తే అప్పటికీ, ఇప్పటికీ ఎంత తేడానో కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది. పైకప్పులు రాలిపడుతున్న షెడ్లు,బాటిలోనే విద్యార్థులను కూర్చొబెట్టి విద్యాబోధన, వరండాల్లో ఒక పక్క మధ్యాహ్న భోజనం తయారీ, మరో పక్క విద్యార్థులను కూర్చోబెట్టి తరగతుల నిర్వహణ జరిగేది. సరైన మరుగుదొడ్లు లేక,రన్నింగ్ వాటర్ సదుపాయం లేక విద్యార్థులు నానా ఇబ్బందులు పడేవారు. నేలపైనే కూర్చొని ఎండకు ఎండుతూ వర్షాలకు తడుస్తూ చదువుకోవాల్సిన దుస్థితి ఏర్పడేది. సుమారు 650 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో గతంలో కేవలం బాలబాలికలకు కలిపి 6 మరుగుదొడ్లు మాత్రమే ఉండేవి, ఇప్పుడా పరిస్థితి లేదు. నాడు నేడు పథకం కింద రూ.65లక్షల వ్యయంతో అదనపు తరగతి గదులను నిర్మించింది. విద్యార్థులు కూర్చొనేందుకు బెంచీలు, పాఠాలు వినేందుకు ఐఎఫ్‌పీ ప్యానెళ్లు, ఆధునిక మరుగుదొడ్లు, ప్రత్యేకంగా వంటషెడ్లు నిర్మించింది. తాగునీరు, వాడుకనీటి సదుపాయం కల్పించింది. విశాలమైన డైనింగ్ హాల్ నిర్మించడంతో అక్కడ కూర్చొని విద్యార్థులు జగనన్న గోరుముద్ద కడుపు నిండా తినే పరిస్థితి కల్పించింది.బాలుర కోసం 19, బాలికల కోసం 9 ఆధునిక వసతులతో కూడిన మరుగదొడ్లు నిర్మించింది.



పైకప్పులు రాలిపడుతున్న షెడ్లోనే నేలపై తరగతుల నిర్వహణ



షెడ్లను తొలగించి కొత్తవి నిర్మాణం



ఇన్‌సెట్లో బెంచీలపై విద్యాబోధన



శుభ్రతకు నోచుకోని మరుగుదొడ్లు



పూర్తి స్థాయి రన్నింగ్ వాటర్ సదుపాయంతో ఆధునిక మరుగుదొడ్లు

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు



చంద్రమౌళీశ్వరస్వామికి అభిషేకాలు

ఎస్.రాయవరం : మండలంలో కార్తీక మాసం మూడో సోమవారం పూజలు ఘనంగా నిర్వహించారు. గెడ్డపాలెం చంద్రమౌళీశ్వరస్వామికి పంచామృత అభిషేకాలు చేశారు. ఆలయ ప్రాంగణంలో లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఈ పూజల్లో అయ్యప్ప మాలధారణ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పెదగుమ్ములూరు ఉమాబ్రహ్మలింగేశ్వరస్వామికి, పెదఉప్పలం బ్రహ్మలింగేశ్వరస్వామి, ఎస్.రాయవరం బుర్రేశ్వరస్వామికి సర్వసిద్ధి సిద్దిలింగేశ్వరస్వామికి, వేమగిరి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో అభిషేకాలు, పూజలు చేశారు.

ఘనంగా వైభవ వేంకటేశ్వర స్వామి కల్యాణం




స్వామి కల్యాణంలో పాల్గొన్న దంపతులు

ఎస్.రాయవరం : మండల కేంద్రంలో వేంచేసియున్న శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం సోమవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. కల్యాణం కోసం ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేసినప్పటికీ తుపాను కారణంగా వర్షం కురవడంతో ప్రధాన ఆలయ మండపంలో స్వామికి కల్యాణం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు దంపతులు భక్తులకు సహాయ సహకారాలు అందించారు.

మిచాంగ్‌తో ముసురు...

- ముందుకొస్తున్న అలలు
- పలుచోట్ల నేలకొరిగిన వరిపైరు
- ఎడతెరిపిలేని వాన



వాడ నర్సాపురం తీరంలో ఎగసిపడుతున్న కెరటాలు



రేవు పోలవరం తీరంలో కెరటాల ఉధృతి

రాంబిల్లి: మిచాంగ్ తుపానుతో ముప్పు పొంచి ఉంది. సోమవారం తుపాను కారణంగా వాడనర్సాపురం, కొత్తపట్నం, వాడపాలెం, లోవపాలెం, సీతపాలెం తీరాల్లో సముద్రపు కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. అలలు ముందుకు దూసుకొస్తున్నాయి. అలలు ఉధృతి బాగా ఎక్కువైందని మత్స్యకారులు సాక్షికి తెలిపారు. మరోపక్క పలు గ్రామాల పరిధిలో వరిపైరు నేలకొరిగింది. దిమిలి, రాజుకోడూరు, మామిడివాడ తదితర గ్రామాల్లో నేలకొరిగిన వరి పొలాలను సంబంధిత రైతులు చూసి ఆందోళన చెందారు. నేలకొరిగిన వరిపైరును వ్యవసాయశాఖ సిబ్బంది పరిశీలించారు. ఏవో సి. సుమంత మామిడివాడలో రైతులకు పలు సూచనలు చేసారు. వరి పొలాల్లో నీరు లేకుండా చూసుకోవాలని ఏవో రైతులకు సూచించారు. సోమవారం వర్షం తెరిపివ్వలేదు. చినుకులు పడుతూనే ఉన్నాయి. పలుచోట్ల రోడ్లపై వర్షం నీరు నిల్వ చేరింది. ముసురు వాతావరణంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మరోపక్క రైతులు మిచాంగ్ తుపానుతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పండించిన వరి పంట దెబ్బతింటుందని ఆందోళన చెందుతున్నారు.

మండలంలో జోరుగా వర్షాలు

మునగపాక : మిచాంగ్ తుపాన్ కారణంగా మండల వ్యాప్తంగా సోమవారం ఉదయం నుంచి వర్షం కురుస్తుంది. సాయంత్రానికి వర్షం జోరుపెరిగింది. దీంతో రైతులు వరి పొలాలకు నష్టం జరిగే ప్రమాదం ఉందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోత దశకు చేరుకున్న వరిపైరుకు ఈ వర్షం నష్టం చేకూర్చేలా ఉందంటూ వాపోతున్నారు. గాలులు లేకుండా వర్షాలు కురిసినా ఫరవాలేదని పంట చేతికి అందివచ్చే తరుణంలో తుపాను ప్రభావం పంటపై పడుతుందని ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా తుపాన్ కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు,రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచనలు చేస్తున్నారు.

ఏకధాటిగా వర్షం

కోటవురట్ల : మిచాంగ్ ప్రభావంతో సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. అధికారుల హెచ్చరికలతో ముందే జాగ్రత్త పడిన రైతులు వరి పనలను కుప్పలు వేశారు. కోతలు అవ్వని ప్రాంతాలలో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఎక్కువ రోజులు వర్షం కురిస్తే గింజ రాలిపోయే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. పంట చివరిదశలో తుపాను ముప్పుతో కలవరపడుతున్నారు. ఈ గండం గట్టెక్కాలని దేవుళ్లకు మొక్కుతున్నారు. కైలాసపట్నం, కోటవురట్ల, లింగాపురం, యండపల్లి, జల్లూరు ప్రాంతాలలో వరి చేలు ఈదురు గాలులకు నేలకొరిగాయి.

నేలవాలిన వరి పైరు

నక్కపల్లి : తుపాను వర్షానికి, వీస్తున్న ఈదురు గాలులకు నక్కపల్లి, కాగిత, ఉద్దండపురం, చిన రామభద్రపురం, గొడచర్ల, వేంపాడు, రమణయ్యపేట తదితర గ్రామాల్లో పక్వానికి వచ్చిన వరి పంట నేల వాలిపోయిందని రైతులు చెబుతున్నారు. కోత కోసం పొలాల్లో ఎండబెట్టిన వరిపనల్లోకి కూడా వర్షపు నీరు చేరిందని చెబుతున్నారు. కాగా తుపాను కారణంగా వరిపంటకు నష్టం వాటిల్లితే రైతులు అధైర్యపడొద్దని అధికారులు చెబుతున్నారు. తేమ శాతం ఎక్కువగా ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత రైతుల వద్దకు వెళ్లి వివరాలు సేకరిస్తామని, వర్షాల వల్ల రైతులకు నష్టం జరిగితే వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ కోరారు. వరిపనలు తడిసిపోతే ఉప్పుకలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు.



పెదతీనార్లలో పర్యటించి మత్స్యకారులను అప్రమత్తం చేస్తున్న అధికారులు



రెతులకు వరికోతలు వద్దని అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

కదిలిన అధికార యంత్రాంగం

నక్కపల్లి: తుఫానుపై అధికార యంత్రాంగం అప్రమత్తమయింది. సోమవారం ఉదయం నుంచి వర్షాలు ప్రారంభమయ్యాయి. దీంతో అధికారులు తుపాను ప్రభావిత గ్రామాల్లో పర్యటించారు. తహసీల్దార్ అంబేద్కర్, ఎండీవో శ్రీనివాసరావు, ఏవో సీతారామరాజు తదితరులు పెదతీనార్ల, చినతీనార్ల, డీఎల్‌పురం, రాజయ్యపేట తదితర గ్రామాల్లో పర్యటించారు. మత్స్యకారులెవరూ వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. సముద్రతీరానికి అతి సమీపంలో నివసిస్తున్నవారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని సూచించారు. మంగళవారం నాటికి తుపాను ప్రభావం తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో తీర ప్రాంత గ్రామాల్లో తుపాను రక్షిత భవనాలను సిద్ధం చేయాలని వీఆర్వోలు, కార్యదర్శులు, మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. జనరేటర్లు, నిత్యావసర సరుకులను కూడా అందుబాటులో ఉంచాలని సూచించారు. శిథిల భవనాల్లో నివసించే వారిని గుర్తించి వారిని కూడా సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తుపాను సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేయడం జరుగుతుందన్నారు. కాగా ఉదయం నుంచి వర్షం పడుతోంది. రోజంతా కురవడంతో ప్రజానీకం ఇళ్లకే పరిమితమయ్యారు. పాఠశాలలకు సెలవు ప్రకటించారు.

తీర ప్రాంతాల్లో అప్రమత్తం

పాయకరావుపేట : మిచాంగ్ తుపాను కారణంగా అధికారులు అప్రమత్తమై పలు ఏర్పాట్లు చేశారు. మండలంలో గల 9 తీర ప్రాంత గ్రామాల్లో మత్స్యకారులకు తగు సూచనలు అందించారు. మండల రెవెన్యూ డీటీ కె.నూకరాజు మండలంలో గల తీర ప్రాంతాలను పరిశీలించి తుపాను సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. తీర ప్రాంత గ్రామాల్లో రెవెన్యూ సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చి సహాయ కేంద్రాల వద్దనే రాత్రి సమయంలో కూడా ఉండాలని ఆదేశించినట్టు తెలిపారు. అదే విధంగా మండల తహసీల్దార్ కేంద్రంలో అధికారులు రాత్రి కూడా విధులు నిర్వహించే విధంగా ఆదేశించారు. అదే విధంగా తీర ప్రాంతంలో తుపాన్ షెల్టర్లు, పాఠశాలల్లోను అవసరమైతే సహాయక చర్యల కొరకు సిద్ధంగా ఉంచారు. అదే విధంగా రైతులకు వరి పంటలను కోతకు వచ్చిన సందర్భంగా తుపాన్ తీరం దాటే వరకు, వర్షాలు తగ్గే వరకు కోతలు కోయవద్దని రైతుల వద్దకు వెళ్లి వ్యవసాయ శాఖ ఏవో పి.ఆదినారాయణ సిబ్బందితో వెళ్లి అవగాహన కల్పించారు. అదే విధంగా సోమవారం మండలంలో 124 ఎం.ఎం వర్షం నమోదైనట్టు డీటీ తెలిపారు. తీర ప్రాంతంలో మత్స్యకారులకు అధికారుల యంత్రాంగం తగు సూచనలు అందించారు.

రేవు పోలవరం తీరంలో...

ఎస్.రాయవరం : మండలంలో మిచాంగ్ తుపాను ప్రభావంతో రేవుపోలవరం తీరంలో కెరటాలు వేగంగా దూసుకొస్తూ, ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నాయి. తుపాను కారణంగా ఉదయం నుంచి మండలంలో చినపాటి వర్షం కురుస్తూ సాయంత్రానికి భారీ వర్షంగా మారింది. దీంతో రెవెన్యూ సిబ్బంది, సచివాలయ అధికారులు, పోలీసు యంత్రాంగం ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తూ అందుబాటులో ఉన్నారు. మత్స్యకారులను చేపల వేటకు వెళ్లకుండా అప్రమత్తం చేశారు.



కాగిత వద్ద నేలవాలిన వరిపనలు

వర్షంతో స్తంభించిన జనజీవనం

- తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- ముందు జాగ్రత్తగా స్కూళ్లు, కళాశాలలకు సెలవులు



సోమవారం సాయంత్రం నిర్మానుష్యంగా కనిపిస్తున్న రైల్వే స్టేషన్ రోడ్డు

యలమంచిలి(అనకాపల్లి రూరల్): మిచౌంగ్ తుపాను ప్రభావంతో యలమంచిలి పట్టణంలో సోమవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఉదయం చిరు జల్లులతో ప్రారంభమైన వర్షం రాత్రి వరకూ మోస్తరుగా కురుస్తూనే ఉంది. మంగళవారం తుపాను ప్రభావం మరింత పెరిగే అవకాశం ఉండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. యలమంచిలి తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. తహసీల్దార్ రాణీ అమ్మాజీ వీఆర్వోలు, ఇతర సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి తుపాను ప్రభావాన్ని, అనంతర పరిస్థితుల్ని చర్చించారు. ముఖ్యంగా మండలంలోని లోతట్టు ప్రాంతాలను ప్రత్యేకాధికారితో కలిసి పరిశీలించారు. వర్ష ప్రభావంతో సోమ,మంగళవారాలు అన్ని స్కూళ్లు, కళాశాలలకు జిల్లా కలెక్టరు ఆదేశాలతో సెలవులు ప్రకటించారు. మరోవైపు మిచౌంగ్ తుపాను ప్రభావంతో పట్టణంలో జనజీవనానికి ఆటంకం ఏర్పడింది. రద్దీగా ఉండే ప్రధాన రహదారి సహా పలు వీధుల్లో జనసంచారం పలుచబడింది. సోమవారం సాయంత్రం కొన్ని వీధులైతే నిర్మానుష్యంగా కనిపించాయి. మోస్తరు వర్షం కురియడంతో పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. రోడ్లు బురదమయంగా మారాయి. ప్రధాన రహదారి పక్కన వీధి వ్యాపారులు, తోపుడు బండ్లు, చిల్లర వ్యాపారులు తక్కువ సంఖ్యలోనే కనిపించారు. రైతులు పొలాల్లో వరి చేలకు నష్టం వాటిల్లుతుందేమోనన్న ఆందోళన వ్యక్తపరుస్తున్నారు. గాలులు తీవ్రత తక్కువగా ఉంటే నష్టం తగ్గుతుందని, లేకపోతే పంట నష్టం ఎక్కువగా ఉంటుందని రైతులంటున్నారు.

మార్మోగిన శివనామస్మరణ



సాంబశివున్ని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక : మండలంలోని పలు శివాలయాలు శివ నామస్మరణతో మార్మోగాయి. ఉదయం నుంచి భక్తులు శివాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసం లోని మూడో సోమవారం భక్తులు భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మునగపాకలోని సాంబశివుని ఆలయంలో వేద పండితులు సాయికుమార్ ఆధ్వర్యంలో శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. లింగరాయి గుడిలో అభిషేకాలు ఏర్పాటు చేశారు. నాగులాపల్లిలోని పురాతన శివాలయానికి భక్తుల తాకిడి పెరిగింది. పార్వతీ పరమేశ్వరులను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగు చర్యలు తీసుకున్నారు.



మునగపాక సాంబశివుని ఆలయంలో శివలింగానికి విభూది అభిషేకం